ISSN 0971-278X

# ప్రజాసాహితి

## సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

ఆగస్టు 2011
వెల : రూ. 10/-




339
జనసాహితి

అణువిద్యుత్ కేంద్రాలకు వ్యతిరేకంగా ...

జర్నలిజం విలువలు ...

నర్తించే పాదాలు - పాకిస్తానీ కథ ...

# అమ్మో...బైలెల్లినారో...?!

– శిఖా ఆకాష్

**వస్తున్నాయ్....** వస్తున్నాయ్
వర్షాకాలం వరదలొచ్చినట్టు
హైకమాండ్‌ల అగ్నిగుండం
ప్రజకేమో దినదినగండం
ప్రజాస్వామ్యమంటే
రాజీనామాల ఆటైపోయాక
ప్రజల ఆకాంక్షలు–ఆత్మగౌరవాలు
హక్కులు–సమస్యలు
అలక్ష్యమయ్యే చోట
అధికారాల్ని కాపాడుకోవడమే ప్రభుత్వాల విధి అయ్యాక
దేశం వీధిన పడిపోతోంది
మధ్యంతరమే గత్యంతరమయ్యే కాలానికి
వరాల వరదలొస్తున్నాయ్
ఎన్నెన్ని కలల వరాలు ఎన్నికల తీవ్ర స్వరాలు
కొత్తపార్టీలొస్తయ్...సరికొత్త గానాభజానాలుంటయ్
గత పార్టీల ఉక్కిరిబిక్కిరి ఉక్కపోతలుంటయ్ ఉడుకుమోత్తనాలుంటయ్
సమ సమాజమూ...ప్రజాసంక్షేమమూ...సామాజిక న్యాయమూ...
స్వర్ణయుగమూ
అన్నీ వుంటయ్
ఎన్నో ప్రణాళికలు...ఎన్నెన్నో ఆపరేషన్ ఆకర్షలు
ఎన్నో ఉచితాలుంటయ్ మరెన్నో రాయితీలుంటయ్
స్త్రీ స్వేచ్ఛ–స్వాతంత్ర్యం–సమానత్వం–మానవ హక్కులు
కోట్లకొలది కుల రిజర్వేషన్లుంటయ్ వర్గీకరణలుంటయ్
పార్టీలకూ జంధ్యాలుంటయ్
చావు ఓదార్పులుంటయ్
రైతు ఓదార్పులుంటయ్
వరద ఓదార్పులుంటయ్ బురద ఓదార్పులుంటయ్
దురద ఓదార్పులుంటయ్
ప్రజా ప్రస్థానాలుంటయ్  పేదలకోసం ధనికుల మోసం
వరాల వర్షం ఎన్నికల విషం
నిట్టూర్పు వెన్నుపోటు రాజకీయాలుంటయ్
పాదయాత్రల ప్రేమకాటులుంటయ్
శవయాత్రల సంఘీభావాలుంటయ్
కొట్టుకు పో...కొట్టుకు పో...!  కూరుకు పో...కూరుకుపో....!
పాత పార్టీల అడుగుల్లో...సరికొత్త పార్టీల మడుగుల్లో...
సదా మీ సేవకులంటూ
గాడిదతోలు కప్పుకున్న పులులుంటాయ్
చిరునవ్వులు రువ్వే సింహాలుంటాయ్
సాష్టాంగ నమస్కారం చేసే నాగుబాములుంటాయ్
పగలుంటాయి ప్రతీకారాలుంటాయ్
ఊబిలుంటాయి ఉచ్చులుంటాయ్
శాశ్వత శత్రువుల్లేని కప్పదాట్లుంటాయ్
గోడమీది పిల్లివాటాలుంటాయ్
అవినీతి కేంద్రాలుంటాయి కుంభకోణాలుంటాయ్
డబ్బు సంచులుంటాయి–సారా సముద్రాలుంటాయ్
ఓటు దేవుళ్ళ పాదాలకు పాలాభిషేకాలుంటాయ్
కలర్ ఫోటోలకు పోజులుంటాయ్
గౌరవ మర్యాదల గుడిసె కౌగిళ్ళుంటాయ్
గంజిబువ్వల సహపంక్తి భోజనాలుంటాయ్
కత్తులు పదునుబట్టిన పొత్తుల పుట్టలుంటాయ్
పగబట్టిన ఉక్కు కళ్ళుంటాయి పద్మవ్యూహాలుంటాయ్
పున్నమి నాటి నాగుబాము పెనవేతలుంటాయ్
ఎదగడానికి ఎత్తుగడలుంటాయి దిగజారడానికి చీకటి దారులుంటాయ్
నెత్తురంటని మర్డర్ మానభంగాలుంటాయ్
వస్తున్నాయ్ వస్తున్నాయ్ నిత్యావసర ధరలు పెరిగినట్టు
వరాల వరదలొస్తున్నాయ్ ఎన్నికల జ్వరాలొస్తున్నాయ్
కొత్తపార్టీలొస్తున్నాయ్
పదవీ వ్యామోహ వ్యాపార కేంద్రాలొస్తున్నాయ్
జెండాలుంటాయి ఎజెండాలుంటాయి
పార్టీల జెండాల కేం కరువు
సిగ్గును దాచే గోచీ గుడ్డలకే కరువు
కిలో బియ్యాలుంటాయి డ్వాక్రా గ్రామాలుంటాయి
సినీ గ్లామర్లుంటాయి పచ్చకామెర్ల భ్రమలుంటాయి
ఊసరవెల్లుల వింత లోకాలుంటాయి
ఇంటింటికీ ఏ.సీ.ఫ్రీలుంటాయి
సమస్తమూ ఉచితాలుంటాయి
సోమరిపోతు పరమపదసోపాన మార్గాలుంటాయి
కలలు గనే శక్తిని నేర్పే తాంత్రిక శక్తులుంటాయి
స్వర్గలోకాలను చూపే మాంత్రిక విద్యలుంటాయి
గ్రహగతులను తీర్చిదిద్దే జ్యోతిష్యశాస్త్రాలుంటాయి
పార్టీలంటే పార్టీలా నాయకులంటే నాయకులా
ప్రజాదేవుళ్ళు...ప్రజాస్వామ్య దోపిడీదారులు...
బడా రాజకీయ వ్యాపారులు
ఎవరి కీర్తి కిరీటాలనో మోయడానికి పల్లకీలుంటాయి
ఎవరి అధికార పృష్టాలు మోపడానికో పీటలు వేసే చేతులుంటాయి
అందరికీ అన్నీ చేసేందుకు ఏటిఎం కార్డుల్లా పార్టీలుంటాయి
దేశప్రగతి విదేశీ బ్యాంకులో దేదీప్యమానమౌతూనే వుంటుంది
ప్రజాస్వామ్య మెల్లప్పుడూ బాబాల ముందు మోకరిల్లుతూనే వుంటుంది
దేశమాత అంగట్లో బేరానికి సిద్ధంగుంటుంది
నాయకులెప్పుడూ నాయకులే
వారసులెప్పుడూ నాయకులే
ధనవంతులెప్పుడూ దేవుళ్ళే దేవుళ్ళెప్పుడూ నిత్యానందులే
పేద ప్రజలే....
గ్రూపులు గ్రూపులుగా
కులాలు మతాలుగా
పార్టీలు పార్టీలుగా
కార్యకర్తల బానిసల సొర్గమొకటి
ఋణానుబంధాల తాకట్టులుంటాయి ప్రేమానుబంధాల కప్పలుంటాయి
ఒక్క మనిషితప్ప మానవత్వ విలువలుతప్ప అన్నివుంటాయి
వస్తున్నారొస్తున్నారు వరాల వర్షం కురిపిస్తున్నారు
ఓట్లను చందావెయ్యండి
మీ సమాధిప్లాట్లను ఉచితంగా పొందండి!

visit us @ www.prajaasaahithi.com

# ప్రజాసాహితి

జనసాహితి ప్రచురణ

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంపుటి: 35 సంచిక: 1 **339** ఆగష్టు, 2011

గౌరవ సంపాదకుడు
నిర్మలానంద

ప్రధాన సంపాదకుడు
**కొత్తపల్లి రవిబాబు**
సంచారవాణి: 9490196890
ravibabujs@yahoo.co.in

జనసాహితి ప్రధాన కార్యదర్శి **మారిన** చిరునామా:
**దివికుమార్,**
divikumar1949@yahoo.com
1-8-28, లోటస్ ల్యాండ్,
సిమెంటు ఫ్యాక్టరీ పోస్టాఫీసు వెనుక, కేదారేశ్వరపేట,
విజయవాడ-520 003
ఇల్లు: 0866 ...................., సెల్లు: 9440167891

రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా
**పి.ఎస్.నాగరాజు,**
సంపాదకుడు
7-15-17, న్యూ కాలనీ,
ప్రశాంతి విద్యానికేతన్ ఎదురుగా,
శ్రీకాకుళం-532001,
సంచారవాణి: 9441913829

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 120-00 |
| ఐదేళ్లకు | రు. 600-00 |
| పదేళ్ళకు | రు. 1000-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 200-00 |
| విదేశాలకు సం॥ చందా | 50 డాలర్లు |

చందాలు పంపవలసిన చిరునామా :
28-9-1, జలీల్‌వీధి,
అరండల్ పేట, కారల్‌మార్క్స్‌రోడ్,
విజయవాడ-520002
ఫోన్: 98486 31604

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

ముఖచిత్రం : చిత్తప్రసాద్ గీసిన చిత్రం
రెండవ అట్ట : నీ పేరు చెప్పి : మార్జ్‌పియర్సీ
మూడవ అట్ట : అమ్మోబయలెల్లినారో : శిఖాఆకాష్
నాల్గవ అట్ట : అణుధార్మిక బాధితులు

✦ సంపాదకీయం-1 : 'అణు భూతం'! మనకొద్దు 3
✦ సంపాదకీయం-2 : మానవసేవే మాధవసేవ అయినప్పుడు
పద్మనాభుని అనంత సంపదలు భారత ప్రజలవే!! 4
✦ అక్షర నివాళి-22 : తిలక్ - సింగంపల్లి అశోక్‌కుమార్ 48
✦ కథలు : నర్తించే పాదాలు పాకిస్థానీ కథ : - మసూద్ ముఫ్తీ
అను : రంగనాధ రామచంద్రరావు 23
తొలిగురువు - ఉదయమిత్ర 33
✦ కథా కవిత : చిన్నమ్మ - సిహెచ్. మధు 16
✦ వ్యాసాలు : అణు వినాశనానికి పాలకుల మోజు-జనజీవనం-
జీవావరణానికి తప్పని ముప్పు - సమత- 6
పరమాణు విద్యుత్ కేంద్రాలలో ప్రమాదాలు- ఒక చిన్నజాబితా 10
కందుకూరి రాజ్యలక్ష్మి - వి.కె.టి.మహాలక్ష్మి 13
చిత్తప్రసాద్ విశ్వరూప దర్శనం - మోహన్ 20
పత్రికాస్వేచ్ఛ - జర్నలిజం విలువలు - మార్కండేయ కట్జు
అను: కె. గౌరీశంకర్ 35
✦ సమీక్ష : అణువిజ్ఞాన ఆకాశంలో రెక్కలు తెగిన
కాగితపు పక్షులు - బి. సులోచన 9
✦ గల్పిక : తూ...తూ...మంత్రం - తమ్మినేని అక్కిరాజు 15
✦ కవితలు : ఛాయరాజ్, పి. ఎస్. నాగరాజు (12), వి. సూర్యారావు, (15),
సంగెవేని రవీంద్ర, తమ్మినేని అక్కిరాజు(28), నిప్పు, గంగినేని (30),
డి. నటరాజ్, డా॥ జి.వి. కృష్ణయ్య(32), ఎస్. బాల సుధాకర్‌మౌళి (36),
గిరీష్‌చంద్ర తివారి'గిర్దీ' అను:ఆర్. శాంతసుందరి (38)
✦ గేయం : అణుశాపం తిప్పి కొడతాం - మహేంద్రాడ 12
✦ వ్యంగ్యం : కావలెను-బాబాలూ, భక్తులూ కావలెను - డి.ఆర్. ఇంద్ర 22
✦ ధారావాహిక : శ్రామిక సాహిత్య వైతాళికులు-13
వోల్టేర్ శకం : అప్టన్ సింక్లెయిర్ : అను : పార్థసారథి 29
అనువాద నవల : హిరోషిమా-4
రచన: రోమన్‌కిమ్-అను :కొడవటిగంటి కుటుంబరావు 39
✦ స్వీయచరిత్రలు-17 : బొబ్బిలి నుండి హైదరాబాదు వరకు- ఎ.ఎ.ఎన్. రాజు 37
✦ శీర్షికలు : సాహిత్య పత్రికల ప్రారంభ సంపాదకీయాలు -18 - వీచిక 44
ముప్పై సంవత్సరాలక్రితం ప్రజాసాహితి 8
బాలసాహితి - నాసరయ్య, స్నేహ 31
మన తెలుగును రక్షించుకుందాం:
పాలనా భాషగా పూర్తిగా అందలం ఎక్కాలంటే-10- గోవిందరాజు రామకృష్ణారావు 43
చైతన్యవాహిని 45
ఉత్తరాలు 46
ఈ పుస్తకాలు అందాయి 47
✦ సంతాపం : గంగినేని మరణానికి సంతాపం 42
✦ ప్రకటనలు : ఆదివాసీ దళిత సాంస్కృతిక కార్యకర్తలకు
విధించిన ఉరిశిక్షలను రద్దు చేయాలి 19
: ప్రజాసాహితి భవన నిధి 2

కవర్ కలర్ డిజైన్ : స్వప్న ఆర్ట్స్ హోమ్, విజయవాడ.
డి.టి.పి : ప్రగతి గ్రాఫిక్స్, విజయవాడ

# ప్రజాసాహితి భవన నిధికి విజ్ఞప్తి

ప్రజలకు నిబద్ధమైన పత్రికను, అందులోనూ సాహిత్య పత్రికను యింత సుదీర్ఘకాలం నిర్వహించటంలోని సాధక బాధకాలను మీరు ఊహించగలరు, ఈ 34 ఏళ్ళ కాలంలో ఎన్నో (సాహిత్య) పత్రికలు వెలువడి, ఆగిపోయిన సంగతి కూడా మీకు తెలుసు, ఆర్థికస్తోమతవుండి కూడా 'భారతి' లాంటి పత్రికల ప్రచురణే నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో కష్టనష్టాలతో 'ప్రజాసాహితి'ని ప్రతినెలా పాఠకులకు మొదటి వారంలో అందేటట్లు చేయడం వెనుకనున్న నిబద్ధ, నిర్మాణాత్మక కృషిని మీరు అర్థం చేసుకోగలరు.

గత 32ఏళ్ళుగా బెజవాడలో అద్దెకు తీసుకున్న రెండు గదుల కార్యాలయంలో 'ప్రజాసాహితి' తన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. చెదలతో, ఎలుకలతో పోరాడుతోంది. ఒకవైపు అద్దె పెరుగుతుండగా, మరోవైపు ముద్రణ సంబంధమైన పెరుగుదల ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇవన్నీ మా కృషికి తక్షణ సవాలుగా నిలిచాయి.

అభిమానుల, మిత్రుల సూచనలు, ఒత్తిడితో 33 ఏళ్ళ తర్వాత మొదటిసారిగా సరిక్రొత్త అభ్యర్థన చేస్తున్నాం. బెజవాడలో కనీసం మూడు సెంట్ల స్థలంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నదే మా ప్రయత్నం. దానికి దాదాపు రూ. ఇరవై లక్షలు సమకూడాయి. ఇంకా పదిహేడు లక్షల రూపాయల నిధి అవసరమౌతుంది. ఈ భవనం 'ప్రజాసాహితి' కార్యాలయంగా వుంటుంది. రచయితలు, సాహిత్యాభిమానులూ, శ్రేయోభిలాషులు తరచు కలుసుకునే సభాస్థలంగా కూడా యిది వుంటుంది.

## రేపటికోసం

ఒక సామాజిక సంధియుగంలో జీవిస్తున్న మనం మారుతున్న సమాజంలో జారిపోతున్న విలువలతో రాజీపడలేక తరతమ స్థాయిలో సంఘర్షిస్తున్న మనం, మన భవిష్యత్తరాలకు పోరాడటానికైనా నిలబడే ఆధారం చూపాలి. కనుకనే ఈ సాహిత్యోద్యమానికి మీవంతు సహకారాన్ని అందించటానికి ముందుకు రావలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

మీ అభిమానమూ, అవకాశమూ అనుమతించిన మేర ఈ నిధికి మీ చేయూతనందించండి. మీ మిత్రుల దృష్టికి తెచ్చి ప్రోత్సహించండి ! ఈ నిధికి రూ. 1000/- పైన విరాళం ఇచ్చేవారి పేర్లు మీ ఆమోదం మేరకు ప్రజాసాహితిలో ప్రచురిస్తాం.

సంపాదకవర్గం

ప్రజాసాహితి

బెజవాడ
25.6.2011

| తేదీ | పేరు | పైకం |
|---|---|---|
| | గత వసూళ్ళు : | 19,03,687 |
| 3-7-11 | కె. పృథ్వీరాజ్, బెంగుళూరు | 5,000 |
| 4-7-11 | డా॥ బి.వి.ఏ. రామారావునాయుడు, శ్రీకాకుళం | 3,000 |
| 4-7-11 | ఎం. వెంకటరెడ్డి, గుంటూరు | 1,000 |
| 10-7-11 | పొత్తూరి సుబ్బారావు, హైదరాబాద్ | 1,000 |
| 10-7-11 | కల్లం పానకాలరెడ్డి, పెనుమాక | 1,000 |
| 10-7-11 | ఈదర గోపీచంద్, నరసరావుపేట | 1,000 |
| 10-7-11 | కోట పురుషోత్తం, తిరుపతి | 5,000 |
| 10-7-11 | ఎ. మాధవీలత, గుంటూరు | 2,000 |
| 12-7-11 | వి. నాగమణి, ఇబ్రహీంపట్నం | 1,000 |
| 13-7-11 | శివలక్ష్మి, హైదరాబాదు | 2,000 |
| 18-7-11 | కె.పి. సుబ్బారావు, విశాఖపట్నం | 2,000 |
| 20-7-11 | డా॥ డి.ఆర్.కె. ప్రసాద్, చల్లపల్లి | 25,000 |
| 23-7-11 | మోటమర్రి రామారావు జ్ఞాపకార్థం | |
| | మోటమర్రి ప్రసన్న, తూర్పుగంగవరం | 5,000 |
| 26-7-11 | మాగంటి సుధాకరరావు, నగరం | 5,000 |
| 26-7-11 | గోగినేని హనుమంతరావు, నగరం | 5,000 |
| 26-7-11 | చావ కిషోర్‌బాబు, నగరం | 5,000 |
| 26-7-11 | జి.యస్.బి. ప్రభాకరరావు, నగరం | 5,000 |
| 26-7-11 | పొన్నగంటి శివయ్య, తెనాలి | 5,000 |
| 26-7-11 | బుర్రా రాహుల్‌గాంధీ, హైదరాబాదు | 5,000 |
| 26-7-11 | వీరమాచనేని కుటుంబరావు, విజయవాడ | 2,000 |
| 26-7-11 | మోర్ల ఉదయశంకర్, విజయవాడ | 5,000 |
| | జూన్ 25 నుండి జులై 25 వరకు రూ. | 91,000 |
| | ఇప్పటికి అందుకున్న మొత్తం రూ. | 19,94,687 |

ఆన్‌లైన్‌లో విరాళాలు పంపేవారు కెనరాబ్యాంకు, గవర్నర్ పేట, విజయవాడ ప్రజాసాహితి పేరుతో గల "అకౌంట్ నెం. **0680101004936** కు పంపించి మాకు తెలియజేయగలరు.

సంచారవాణి : 94901 96890

## సంపాదకీయం-1

# 'అణు భూతం'! మనకొద్దు

**ప్రపంచ** పర్యావరణవేత్తలూ, వ్యవసాయ ఆర్థికవేత్తలూ, వైజ్ఞానిక సామాజిక శాస్త్రవేత్తలూ, ముక్తకంఠంతో నిరసిస్తున్నా మన పాలకులు మొండిగా అణువిద్యుత్ వైపే ఎందుకు మొగ్గుతున్నారు

హిరోషిమా, నాగసాకి, చెర్నోబిల్ లాంటి దారుణాల నుండి గుణపాఠాల్ని ఎందుకు తీసుకోవడం లేదు?

జపాన్‌ను ఇటీవల తాకిన భూకంపంతో వచ్చిన సునామీవల్ల అణు ప్రమాదపు భయానికి గురైన ఫుకుషిమా నగరం ఘోర అల్లకల్లోలమైన సంఘటన తరువాత కూడా మన మన్‌మోహన్ సింగుగారు "అణుఒప్పందం నుండి వైదొలగేది లేద"ని ప్రత్యేకంగా ప్రకటించి ఎవరి మెప్పు పొందాలని తహతహలాడుతున్నారో!

2032 నాటికి దేశ విద్యుదవసరాలలో 9 శాతాన్ని అంటే 64 వేల మెగావాట్ల విద్యుత్తుని అణు విద్యుత్ ఉత్పాదన ద్వారా తీర్చుకోవాలని మన ఘనత వహించిన దేశ ఏలికలు ఎందుకు ఉబలాటపడుతున్నారు?

భూపాల్ హత్యాకాండ మిగిల్చిన చేదు అనుభవాల్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఎట్టెదుట వుంది గదా!

అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణంలోగానీ, నిర్వహణలోగానీ, మన వాళ్ళకున్న అనుభవం, నిబద్ధత, ప్రజాదృక్పథం ఎంత డొల్లబారిపోయివుందో మన వర్తమాన విద్యుత్ విధానాన్ని పరిశీలిస్తేచాలు-మన మెంత అభద్రతలోకి నెట్టబడుతున్నామో అర్థం చేసుకోవడం కష్టమేమీకాదు.

అణువిద్యుదుత్పాదనలో భారీగా పోగయ్యే అణుధార్మిక వ్యర్థాలను నిల్వచేయడం-అదీ దీర్ఘకాలం కొనసాగవలసి రావడం-ఎంత భయంకరమైన ప్రమాదమో ఎవ్వరూ మాట్లాడ రెందుకని? ఆ ప్రక్రియకయ్యే వేలకోట్ల రూపాయల నిర్వహణా (మెయింటెనెన్స్) ఖర్చును అణువిద్యుదుత్పాదనలో ఎందుకు భాగం చేయటంలేదు? లేదా ఆ ఖర్చుని తమ ఖాతాల్లో రాసుకుని, ప్రమాదాల బారిన ప్రజలను వొదిలేసి-ఆ సొమ్ముని కూడా స్విస్ బ్యాంకుల్లో జమ చేసుకుంటారేమో!

భూకంపాలకు ఆటపట్టయిన శ్రీకాకుళం (కొవ్వాడ), మహారాష్ట్ర (జైతాపూర్)ల భౌగోళిక వాస్తవికతను ఎందుకు పరిగణనలోకి తీసుకోవటంలేదు?

అసలు మన పాలకముఠాలూ, ప్రభుత్వాలూ ఎవరికోసం ఉన్నాయి? ప్రభుత్వ విధానాలూ, ప్రజల ఆకాంక్షలూ ఒకే దిశలో పయనిస్తున్నాయా? పాలక ముఠాలు చెప్తున్న 'అభివృద్ధి' - ప్రజల 'అభివృద్ధి' ఒకటేనా? ఒకటే అయితే 64 ఏళ్ళ 'సొతంత్ర' భారతదేశంలో 28 కోట్ల జనాభా ఇంకా దారిద్ర్యరేఖ దిగువనే ఎందుకుంది?

ఇదే దేశంలో 80 శాతం పైగా జనాభా కుటుంబ ఆదాయాలు రోజుకు కేవలం నూరు రూపాయలలోపే ఉందని స్వయంగా ఐక్యరాజ్య సమితి గణాంకాలే చెబుతున్నాయిగదా!

మరోవైపు, 15వ లోక్‌సభకు ఎన్నికైన 543 మంది సభ్యులు కేవలం "ప్రకటించిన" ఆస్తుల విలువ మొత్తం రూ. 3075 కోట్ల రూపాయలు! అంటే ఒక్కొక్కరి సరాసరి ఆస్తి హీనాతిహీనంగా 5.7 కోట్ల రూపాయలు - అవీ చట్టబద్ధంగా బయటకు ప్రకటించుకొన్నవి మాత్రమేననుకోండి!!

కాగా, కుంభకోణాల్లో మూటకట్టుకున్న 'ప్రజల సంపద' గురించి రాజ్యాంగానికి ఎలాగూ సంబంధం లేదు. అయినా ముంజేతి కంకణానికి అద్దమెందుకు?

ఈ తీవ్ర అంతరాల మధ్య, ఇన్ని వ్యత్యాసాల మధ్య ఇటీవల శ్రీకాకుళంలో కొవ్వాడ గ్రామంలోనూ, గుంటూరు జిల్లాలో నిజాంపట్నం దగ్గర, కడప జిల్లాలో పులివెందుల దగ్గర మొత్తంగా 17వేల మెగావాట్ల సామర్థ్యంగల అణువిద్యుత్ కేంద్రాలు నిర్మించాల్సిందేనంటూ ప్రభుత్వం మొండిగా బిర్రబిగుసుకుని కూర్చుంది.

తనది కాకపోతే కాశీదాకా డేకమన్నట్లు - ప్రజలు పోతే ప్రభుత్వానికేంటి? బాధ్యతారాహిత్యంలో, జవాబుదారీ లేక పోవడంలో అందెవేసిన చెయ్యి అనిపించుకున్న మన పాలక వ్యవస్థ 'సొంతలాభం' యావలో పడి సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల సేవలో మునిగి, వాళ్ళ మోచేతినీళ్ళు తాగడమే 'దేశభక్తి'గా పోజులు కొడుతోంది!

ప్రపంచ వ్యాప్తంగా అణుధార్మిక శక్తితో ప్రమాదాలు ఉన్నాయని పెద్ద ఎత్తున హెచ్చరిస్తున్నా, చీమకుట్టినట్లైనా లేని మన దేశాధినాయకులది అజ్ఞానమో, మూర్ఖత్వమో, స్వార్థమో అన్నీ కలగలిసిన పైశాచికత్వమో ప్రజలే అర్థం చేసుకోవాలి.

ప్రమాదాలు జరుగుతున్నాయని బస్సు ప్రయాణాలు మానేశామా?

ప్రమాదాలు జరుగుతున్నాయని రైలు ప్రయాణాలు మానేశామా?

ప్రమాదాలు జరుగుతున్నాయని విమాన ప్రయాణాలు మానేశామా?

ప్రమాదాలకు భయపడి అభివృద్ధి మానుకుంటామా?

అని ఘనత వహించిన ప్రజా ప్రతినిధులు తమ నియోజక వర్గాల్లో అమాయకంగా ప్రజల్ని ప్రశ్నిస్తున్నారు. చారిత్రక గుణ పాఠాలకు పెడచెవిన పెట్టిన వాళ్ళ సరిగమలకు ప్రభుత్వ మేధావులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. మాజీరాష్ట్రపతి అబ్దుల్ కలాంలాంటి శాస్త్రవేత్తలు కూడా అందుకు మినహాయింపు కాదు. శాస్త్రజ్ఞానం కలిగి వుండడం ఒక ఎత్తయితే, అది సామాన్య ప్రజానీకపరం చేయడం మరో ఎత్తు.

బస్సు, రైలు, విమాన ప్రమాదాల్లో ఆ ప్రయాణం చేస్తున్న వాళ్ళే ప్రమాదాలకు గురవుతారు. అణుధార్మికతకు గురైన వాళ్ళేకాదు, తరువాతి తరతరాల మానవ వనరులన్నీ అంగ వైకల్యాలకు, మానసిక వైకల్యాలకు, అనేక జబ్బులకు గురై నశిస్తాయన్న దూరదృష్టి, మన ఓటు-నోటు పాలకులకు ఎన్నటికీ అర్థంకాదు. భవిష్యత్తరాల మానవజాతిని నిర్వీర్యం చేసే హక్కు ఈ స్వార్థ మూర్ఖ శక్తులకు ఎవరిచ్చారు?

అణువిద్యుత్ కర్మాగారంలో ప్రమాదం జరిగితే సగటున 7000 చ॥కి॥మీ॥ మేర భూమి నిస్సారమవుతుంది. ప్రాణనష్టం

లెక్కింపలేనిదిగా వుంటుంది. కనీసం లక్షమంది క్యాన్సర్‌తో బాధపడతారు. ఈ "కల్లోల అభివృద్ధి" ఎవరి బొర్రలు నింపడానికి?

కంటికి కనిపించని, చెవికి వినిపించని, వాసనకు అందని, రంగు, రుచి, వాసన లేని అణుగరళాన్ని ప్రజల రక్తనాళాల్లో గుమ్మరించడమే 'అభివృద్ధి' అయితే ఈ విధ్వంసక అభివృద్ధి మనకొద్దు. ఈ ఋణార్థిక పరాధీన రాజకీయ రాక్షసక్రీడ మనకొద్దు.

ఈ 'ఉన్నవాళ్ల' అభివృద్ధి మనకొద్దు! మా కొద్దీ దళారీ పాలన!

అభివృద్ధి చెందిన సామ్రాజ్యవాద దేశాలలో అణువిద్యుత్ కర్మాగారాలను నిర్మించటం ఆపేశారు. అయితే వారి అణ్వాయుధాలను నింపుకోవడానికి అవసరమైన ప్రమాదకర ప్రక్రియకు భారతదేశంలాంటి పరాధీన దేశాలను పాలకులను ఎంపిక చేసుకుంటున్నారు. అందుకే మన దేశంపై తీవ్ర వత్తిడి పెంచి "అణుబంధం" వొప్పందాన్ని పార్లమెంటులో ఆమోదింప జేసుకున్నారు.

కష్టపడే వాళ్ల ప్రపంచంలో తేరగా తిని బలిసే 'బదనికల అభివృద్ధి' మీద సంఘటిత జనావళి తిరుగుబాటు ఒక రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అవసరం! సామాజిక కర్తవ్యం!

గొలుసుకట్టు చర్యల అణువిస్ఫోటన 'అభివృద్ధి' కల్లోలాన్ని ప్రజల గొలుసుకట్టు చర్యతోనే ఎదుర్కొనే ప్రజాతంత్ర చలనశీలతని సాహిత్యరంగం పెంపొందించాలి. పదును పెట్టాలి. కళా సాంస్కృతిక రంగం ఆ బాధ్యతలను పంచుకోవాలి!

ప్రజాకవులూ, కళాకారులూ, ప్రజాతంత్రవాదులూ, సామాజిక వేత్తలూ, అందరూ ఒక వేదికగా ఏర్పడి సంఘటితంగా ఉద్యమిస్తేనే ఈ బీభత్సాన్ని ఆపగలం!

"అనేకులింకా! అనాథులంతా! అశాంతులంతా! దీర్ఘ శృతిలో తీవ్ర ధ్వనితో విప్లవశంఖం వినిపిస్తారోయ్!

(శ్రీశ్రీ)

12-07-11

## ఉల్లేఖనాలు

అణుశక్తి కేంద్రం కూడా కొన్ని పరిస్థితులలో ఒకరకమైన అణుబాంబులాంటిదే. అణుబాంబువల్ల వచ్చే అగ్నిగోళ శక్తిని విచ్చలవిడిగా వదిలి పెడతాం. కానీ అణురియాక్టర్లవల్ల ఉత్పన్నమయ్యే ఉష్ణశక్తిని భారజలంతోగాని లేకపోతే గ్రాఫైట్ పలకలను ఉపయోగించిగాని అదుపుచేస్తాం. ఈ భయంకరమైన ప్రక్రియలను అదుపు చేయడానికి ఎన్ని భద్రతా ఏర్పాట్లు చేసినప్పటికీ ఏదో ఒక పొరపాటు వల్ల ప్రక్రియలు గాడితప్పితే చెర్నోబిల్ లేక ఫుకుషిమా తరహా ఘోరప్రమాదాలు జరుగుతాయి. దీనివల్ల కొన్ని వేల చదరపు కిలోమీటర్లు విస్తీర్ణంగల జీవకోటి ప్రమాదానికి గురవుతుంది.

– ప్రొ।। టి. శివాజీరావు, ప్రముఖ పర్యావరణవేత్త,
గీతం విశ్వవిద్యాలయం, విశాఖపట్నం
(ఆంధ్రజ్యోతి, 18-6-2011)

శ్రీకాకుళంలో 6 థర్మల్ విద్యుత్ కేంద్రాలూ, ఒక అణు విద్యుత్ కేంద్రం నిర్మించడంవల్ల–

వ్యవసాయ సంపద నశిస్తుందనీ, ఆహార సమస్యలు పెరుగుతాయనీ, ఇది పాలకులు అనుసరిస్తున్న అభివృద్ధి నమూనా అనీ, దీనివల్ల ప్రజల జీవనం, పర్యావరణం ధ్వంసమై పోతుందనీ' హెచ్చరించారు.

– ప్రొ।। కె.ఆర్. చౌదరి, వ్యవసాయ ఆర్థిక వేత్త,
(10-7-2011న శ్రీకాకుళంలో జరిగిన ఉత్తరాంధ్ర సదస్సులో)

సంపాదకీయం-2

### మానవసేవే మాధవసేవ అయినప్పుడు

# పద్మనాభుని అనంత సంపదలు భారత ప్రజలవే!!

"భారతదేశం పేదదికాదు. భారత ప్రజలు మాత్రమే పేదవారు" అని వి.కె.కృష్ణమీనన్ ఏనాడో చెప్పిన సత్యాన్ని తు.చ. తప్పకుండా 64 ఏళ్ల స్వాతంత్ర్యం కాపాడుకుంటూ వస్తోంది ఒకవైపున మన అపారసంపదల కేంద్రాలుగా విపరీతంగా వేలకోట్ల రూపాయల ఆస్తుల్ని పెంచుకుంటున్న బడా పారిశ్రామికవేత్తలూ; ప్రభుత్వ ఖజానాలను కొల్లగొడుతున్న రకరకాల గుత్తేదార్లు, అవినీతిమయమైపోయిన రాజకీయ నాయకులూ వారి వందిమాగధ అధికార గణాలు వున్నాయి. స్విస్సు బ్యాంకులు, పుట్టపర్తులు, కల్కి భగవాన్లు, దత్తగణపతులు ఇటీవల బయల్పడుతున్న అనంత పద్మనాభస్వామి (తిరువనంతపురం) నేలమాళిగల్లో దాగిన నిధులూ ఈ సత్యాన్ని తేటతెల్లంచేస్తున్నాయి. మరొకవైపున పెచ్చరిల్లుతున్న కటిక పేదరికానికి ప్రభుత్వాలు చెబుతున్న వార్షిక గణాంకాలే అవసరంలేదు-ఏ పెద్ద రైల్వేస్టేషను, బస్టాండు, భక్తుల రద్దీవున్న పుణ్యక్షేత్రాన్ని దర్శించుకున్నా యిట్టే అర్థమౌపోతుంది.

"రాతి బొమ్మకేల రంగైన వలువలు
గుళ్లు గోపురములు కుంభములు
కూడుగుడ్డ తాను కోరెనా దేవుడు?"

అని అనంత పద్మనాభునికి తమ అపార నిధుల్ని కైంకర్యం చేసిన రాజామార్తాండవర్మ(18వ శతాబ్దం) కు ముందే మన వేమన చెప్పేశాడు. "దేవుడు-రాజ్యము-సంపద" కలగలిసిపోయి వుండే రాచరికపు యుగసాంప్రదాయాన్ని ఆనాటి తిరువాన్కూరు

సంస్థానాధీశులు నిజాయితీగా పాటించారు. అనంత పద్మనాభస్వామి ఆలయంలో కళ్ళు చెదిరిపోయేంత, మన ఊహాకందని అంతులేని ఆభరణాల గుట్టలు...లక్షలకోట్ల రూపాయల విలువచేసే నిధులు, తమ రాజవంశానివిగాకాక కేవలం దేవునికి మాత్రమే చెందినవిగా పరిగణిస్తూ నేటికీ "ధర్మకర్తలు"గా అపార ధనరాసుల్ని వారు కాపాడుతూ వస్తున్నారు. సర్వవ్యాపిత అవినీతిమయంగా దేశాన్ని దిగజార్చిన బురిడీ ప్రజాస్వామ్య పాలకుల నేటి భారతంలో, తిరువాన్కూరు రాజవంశీకుల నిజాయితీ, శయనముద్రలోని అనంత పద్మనాభుని బంగారు విగ్రహంలా మెరిసిపోతోంది.

ఈ సందర్భంగా అక్కినేని నాగేశ్వరరావు "ఆస్తిక-నాస్తిక" అన్నదమ్ములుగా ద్విపాత్రాభినయం చేసిన "బుద్ధిమంతుడు" (బాపూ-రమణల) సినిమాను గుర్తుకు తెచ్చుకోవాలి. ఈ అన్నదమ్ముల పూర్వీకులు దాచిన గుప్తనిధి వొకటి సినిమా చివరి భాగంలో బయలుపడుతుంది. దాన్ని గుడికి అంటే దేవునికి సమర్పించుకోవాలని అన్నా, బడికి అనగా పిల్లల చదువుకు వెచ్చించాలని తమ్ముడూ ఘర్షణపడతారు. అందులోనే గుడినీ, గుడిలో లింగాన్నీ మింగేసే ఊరిపిల్లల చదువుల్ని గాలికొదిలేసే నాగభూషణంలాంటి పెత్తందారీ భూస్వామి కూడా వుంటాడు. మన బురిడీ పాలక వర్గాలను అర్థంచేసుకోవటం కష్టంగానీ, ఈ భూస్వామి స్పష్టంగా దుష్టుడనీ, అవినీతి మూర్తీభవించిన వాడనీ మనకు తెలిసిపోతుంటుంది. దీన్ని మనం అనంత పద్మనాభునికి అన్వయించుకునేప్పుడు తప్పనిసరిగా ఒక సాంప్రదాయకభావననూ మరొక ఆధునిక ప్రజాస్వామ్య యుగస్ఫూర్తినీ పరిగణనలోకి తీసుకోవాలి. అవి 1. మానవసేవే మాధవసేవ 2. ప్రజాస్వామిక యుగంలో ప్రజలే అంతిమ నిర్ణేతలు. భగవంతుడు మట్టినీ బంగారాన్నీ సృష్టించాడని నమ్మే భక్తులుకూడా జ్ఞాపకం పెట్టుకోవాల్సిన మరొక అంశం ఏమంటే-అనంతపద్మనాభుని విగ్రహాన్ని గొప్పకళాత్మక రూపంలోకి మలిచినది మానవులేనన్న సత్యాన్ని! కళాఖండాల్లాంటి బంగారు నగలను వజ్ర, వైడూర్య, మణిమయరత్న ఖచిత మరకత మాణిక్య ఆభరణాలను సృజించింది మానవ శ్రమ, మేధస్సు, నైపుణ్యాలే!

**"రాజు కిరీటంలో పొదిగిన ప్రతి రత్నం గడ్డకట్టిన రూపంలో వున్న రైతు రక్తం"** అన్నాడు.12వ శతాబ్దికి చెందిన సూఫీ వేదాంతి అమీర్ ఖుస్రో. తిరువాన్కూరు సంస్థానాధీశులకు కూడా యిది వర్తించే సూత్రమేకాని, చాలా మంది రాజులూ-నవాబుల్లా కాకుండా వారు తరతరాలుగా దేవుని సొమ్మును తమ స్వంతానికి వినియోగించ కుండా వుండటమేకాక మరెవరూ కైంకర్యం చేయటానికి అవకాశం యివ్వకుండా కాపాడటంద్వారా నేటి తరాల ప్రశంసలుకూడా పొందుతున్నారు. తమ యాజమాన్యాన గల దేవాలయంలోకి కులవివక్ష లేకుండా హిందువులెవరైనా ప్రవేశించవచ్చని 1936లోనే అమలుకు ఆదేశించారు. ఆధునిక ప్రజాస్వామ్య యుగ స్వభావాన్ని ఆ మేరకు గౌరవించారు. పద్మనాభుని 'అనంత' సంపద మానవసేవకు- ముఖ్యంగా విద్య-వైద్యంకు-వినియోగించాలని వారు భావిస్తే మంచిదని మనం ఆకాంక్షిస్తాం. కానీ దీన్ని కాదనే మతవాదులున్నారు. వాళ్ళు నేటి దేశంలోని "రాజ్యం-పరిపాలనా" వ్యవస్థల భయంకర అవినీతిపట్ల ప్రజలకున్న అపనమ్మకాన్ని వ్యతిరేకతల్ని అడ్డుపెట్టుకుంటున్నారు. ఇహలౌకికానికి పారలౌకికానికి నడుమ వుండే విభజన రేఖల్ని గందరగోళ పరుస్తున్నారు. నేటి కుహనా లౌకికాన్నీ, బురుడీ ప్రజాస్వామ్యాన్నీ, మిధ్యాస్వాతంత్ర్యాన్నీ నిజమైనవేనని పాలకులు కల్పిస్తున్న భ్రమలకీ, డబ్బాలకీ వంతపాడుతూ...లౌకిక ప్రజాస్వామ్య స్ఫూర్తినే నిరాకరించేట్టు చేయ యత్నిస్తున్నారు. విశ్వాసాలపేరిట 'నాగబంధా'ల్లాంటి మౌఢ్యాన్ని వ్యాపింప జేయటంలో తమ వంతు పాత్రను పోషిస్తున్నారు. ఆధునిక యుగస్ఫూర్తికి "మనిషి" కేంద్రమనీ, మతాన్ని వ్యక్తిగత విశ్వాస స్థాయిలోనే నిలిపివుంచాలనే లౌకిక, ప్రజాస్వామ్య తత్త్వానికి వారు పూర్తి విరుద్ధంగా ప్రవర్తిస్తుంటారు.

''రాజుల సొమ్ము రాళ్ళపాలు'' అనేది పాత సామెత. మధ్యయుగాల్లో యూరోపు దేశాలకంటె ఎంతో సంపదలు కలిగివుండి కూడా, ఆధునిక ప్రజాస్వామిక పారిశ్రామికీకరణకు మనదేశం రాచరికాన్ని దాటి బాటలు వేయలేకపోయింది. తర్వాత కాలపు వలసవాదం మనల్ని మన కాళ్ళమీద ఎదగనివ్వకుండా చేస్తోంది. సార్వత్రిక అవినీతి మన సమస్త విలువల్ని వమ్ము చేస్తోంది. అయినా అపార దేశసంపద నేలమాళిగల్లో ఇంకా మగ్గనివ్వటం చారిత్రక అపచారమే అవుతుంది. అది రహస్యనిధి కాదు. కోటి తాళ పత్రాల ఆధారాలు వాటికున్నాయి. తిరువాన్కూరు సంస్థానం నేటి భారత రాజ్యవ్యవస్థలో అంతర్భాగంగా రూపొందిన 1949ని వొక ప్రాతిపదికగా తీసుకుని, అంతకు పూర్వపు నిధులలో రోజువారీ మత విధులకు అవసరమైనవి ఆలయానికి మిగిల్చి, చారిత్రక ప్రాముఖ్యతగల వాటిని పురాతత్వ(ఆర్కైవ్స్) శాఖకు అప్పగించి, జాతీయ వారసత్వంగా నిలుపుకోవాల్సిన కళాత్మక ప్రాముఖ్యంగలవాటిని "సందర్శనశాల" (మ్యూజియం)లో భద్రపరిచి మిగిలినవి ప్రజోపయోగ కార్యకలాపాలకు ముఖ్యంగా విద్యా, వైద్యం, పరిశోధనలకు కేటాయించటం ఉపయుక్తంగా వుంటుంది. 1949 తర్వాత లభించిన ఆదాయాన్ని దేవాలయపు రోజువారీ నిర్వహణకు వినియోగించుకోవచ్చు. ప్రతి ముఖ్యమైన కేటాయింపు నిర్వహణలో రాజా మార్తాండవర్మ వంశీకులకు తగు స్థానాన్ని కల్పించి గౌరవించటం మంచిది.

ఏది ఏమైనా మన దేశపు స్వాతంత్ర్యాన్ని అత్యంత నికృష్ట స్థితికి చేర్చిన ఈ పాలకుల పట్ల ప్రజలు ఎంత అప్రమత్తంగా వుంటే అంతే ప్రజలకు దక్కేది. లేకుంటే దేశాన్ని కొరుక్కుతింటున్నట్లు, విదేశాలకు కట్టబెడుతున్నట్లూ-పద్మనాభుని అనంత సంపదల్ని కూడా బొక్కేయగల విషనాగులున్నాయి. తస్మాత్ జాగ్రత్త!

**24-7-2011**

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=293**